అరిగే రామారావు




"రంగీ— రంగీ"

ఎవరూ పలకలేదు. అసలే ప్రయాణ బడలికతో వున్న శ్రీదేవికి తన పిలుపుకు సమాధానం రాకపోయేసరికి అంతులేని కోపమూ, విసుగూ ముంచుకొచ్చాయి.

కుర్చీలోంచి లేచి గుమ్మం దగ్గర కెళ్ళింది. తెర ప్రక్కకి తీసి వరండాలో చూచింది. ఎవరూ కనిపించలేదు.

"చంద్రమ్మా!" అని కోపంగా గట్టిగా పిలిచింది.

ఆ పిలుపుకు సువారంలోంచి చంద్రమ్మ హడావుడిగా బయటికొచ్చింది. కోపంతో జేవురించిన మొగంతో గుమ్మంలో నిల్చొని వున్న చిన్నమ్మగార్ని చూడగానే వయస్సు మళ్ళిన చంద్రమ్మకు పంచప్రాణం పయినే పోయింది.

చంద్రమ్మను చూచి, "ఆ రంగేది?" అని విసురుగా అడిగింది శ్రీదేవి.

చంద్రమ్మ దివాణంలోని దాసీలందరి మీద పెత్తనందారు. దాసీల మీద అజమాయిషి చేసే 'హెడ్‌దాసీ' అన్నమాట! అందుకే వూర్నుంచి అప్పుడే వచ్చిన శ్రీదేవికి రంగి కనిపించపోయేసరికి చంద్రమ్మను పిలిచింది.

చంద్రమ్మ చేతులు నలుపుకుంటూ "లేదమ్మా!" అని మెల్లగా అంది.

"ఏం ఎక్కడికి వెళ్ళింది?"

"కొలువుకు రావటంలేదమ్మా!"

"ఎందుకని?"

"అయ్యగారు దాన్ని కొలువు మాన్పించారు."

అదేమిటన్నట్లు చంద్రమ్మ వంక ఆశ్చర్యంగా చూచింది శ్రీదేవి. సమాధానంగా చంద్రమ్మ తలవంచుకుంది. వివరాలు అడిగి వినే వోపిక శ్రీదేవికా సమయంలో లేదు. రిజర్వుడు ఏ. సి. కంపార్ట్‌మెంట్‌లో నూట యాభై మైళ్ళు, గతుకుల రోడ్డు మీద చిన్నకార్లో ఇరవై మైళ్ళు ప్రయాణం చేసి అప్పుడే వచ్చిన శ్రీదేవికి ఎంతో నీరసంగా మరెంతో విసుగ్గా వుంది.

"అంతే నా కింకెవరూ దాసీలు లేరా?" అని చిరాగ్గా అడిగింది.

"లేకేమమ్మా, చంద్రకాంతం వుందిగా!" అని "కాంతం" అని కేకేసింది చంద్రమ్మ.

శ్రీదేవి తలార స్నానం చేసి వచ్చింది. జుట్టు విరబోసుకుని పేపరు చదువుతూ కుర్చీలో కూర్చుంది.

పేజి త్రిప్పుతూ కొత్త పనిమనిషి కొరకు ప్రక్కకు చూచింది. అది గదిలో అటూ ఇటూ తచ్చాట్లాడుతుంది. పాపం దానికి ఏ పని తర్వాత ఏ పని చేయాలో, ఎలా చేయాలో తెలియదు. అందుకే భయం భయంగా అక్కడక్కడే అల్లిబిల్లి తిరుగుతుంది.

"నీ పేరేమిటి? చంద్రముఖా, చంద్రవంకా?" కుర్చీలో వెనక్కి జారగిల పడి జుట్టు వెనక్కి వేసుకుంటూ అడిగింది శ్రీదేవి.

"చంద్రకాంతమ్మగారు!" అతి వినయంగా సమాధానం చెప్పింది.

ఈ చంద్రకాంతాన్ని అందరూ 'కాంతం, కాంతం' అని పిలుస్తారు. ఈరోజు వుదయం వరకు సువారంలో పని చేసింది. శ్రీదేవి వచ్చే అంతకుముందు పచ్చేసే రంగిని పని మాన్పించేయటం వల్ల ఈ కాంతాన్ని చిన్నమ్మగారి కోసం నియమించింది చంద్రమ్మ.

చిన్నమ్మగారికి కాంతాన్ని చూస్తే చాలు

ఎక్కడలేని చిరాకూ ముంచుకొస్తోంది. మడ్డి మొగంది. ఏ పని తర్వాత ఏ పని ఎలా చేయాలో తెలియదు. సూట్‌కేస్‌లో బట్టలు తీసి అలమరలో సర్దటం కూడ తెలియదు. వుత్త మొద్దావతారంలాగా వుందని మనస్సులోనే కాంతాన్ని కంటగించుకుంది శ్రీదేవి.

రంగి అయితే తను తలార స్నానం చేసి రాగానే వెంట్రుకలు పాయలు పాయలుగా తీసి టర్కీటవల్‌తో తుడిచేది. సాంబ్రాణి పొగవేసేది. ఈ కాంతం వూరికే గుడ్లు మిటకరించుకుని చూస్తుందేగాని జుట్టు ముడవదు, పొగవేయదు. అసలు రంగిని వీళ్లెందుకు పని మాన్పించినట్లు? తనొక్క మూడునెలలు లేకపోయేసరికి వూహించలేని మార్పు లెన్నెన్నో జరిగిపోయాయి. అన్నీ క్రొత్త మొగాలే కన్పిస్తున్నాయి! ఎవర్ని అడుగుతుంది? ఏమంటుంది? ఎంత ఇదైనా యింటికోడలు కదా? ఇదే గనక తమ యిస్టేటులో అయితే ఇందుకు అందర్నీ ఎంత హడలగొట్టేదో!

ఆరాత్రి పదిగంటల లోపల శ్రీదేవికి తన యిష్టసఖి అయిన రంగిని తన భర్త పని మాన్పించిన విషయం కొన్నివందల సార్లు మనస్సుకు తట్టి ఎంతో బాధ కలిగింది. ప్రతి పనిలోనూ ప్రతి నిమిషంలోను అది లేకపోవటం ఆమె కెంతో పెద్ద లోటుగా కనిపించింది. అది వుంటే తనకెంతో సందడిగా వుండేది. ఎంత చక్కగా పొద్దు పోయేది. తను యింటికి కోడలుగావచ్చిన ఈ సంవత్సరం సంవత్సరంన్నర కాలంలోనూ రంగి ఎప్పుడూ తనని అంటిపెట్టుకుని వుండేది. అవసరమయి అడిగితే తన ప్రాణం కూడ యిచ్చేస్తుందా అన్నంత భక్తిగా తనని కొలిచేది. దానికి ఏ పనీ ఇలా చెయ్యి అలా చెయ్యి అని చెప్పవల్సిన పనేలేదు. నోట్లోమాట నోట్లో వుండగానే అన్నిపనులూ చకచకా చేసేది. ఎప్పుడూ నవ్వుతూ కేరుతూ ఎంతో సరదాగా వుండేది. ఎన్నెన్నో కబుర్లు చెప్తుండేది. దాని కబుర్లు వింటుంటే గంటలు నిమిషాల్లాగా గడచిపోయేవి. దానికొక మేనత్త కొడుకున్నాడు. వాడి పేరేదో వుంది...రాముడట్లుంది. వాడూ యిక్కడే పన్జేస్తున్నాడు. ఎప్పుడూ వాడి కబుర్లు చెప్తుండేది.

తనకింత యిష్టురాలయిన రంగిని ఈయనగారు ఎందుకు మాన్పించినట్లు? అదేం చేసింది? ఒక పనిమనిషిని ఎందుకని తీసేశారు, ఏమిటి అని మరో పనిమనిషిని గాని, ఇంకెవరినిగాని వివరాలు అడిగి తెల్సుకోవటం ఈ కుటుంబాల్లో నామోషి అయిన విషయం! అలాటిది తన భర్తనే అడగటం గౌరవభంగమైన విషయం. ఒకవిధంగా చూస్తే సాహసమే!...అయినా శ్రీదేవి ఆరాత్రి తన భర్తను ఈ విషయం అడక్కుండా వుండలేకపోయింది. ఏదో మాటల సందర్భంలో రంగి విషయం తీసికొని వచ్చింది.

అందుకామె భర్త వినగానే, "అదో డర్టీ క్రీచర్! దాని సంగతి ఇప్పుడెందుకు?" అని అన్నాడు.

తనింకేమంటుంది? సాలుకు కొన్నిలక్షల రాబడి కల ఒక పెద్ద యిస్టేటుకు కోడలయిన తను ఒక సామాన్య పరిచారికను గురించి, రోజు మొత్తంమీద రాత్రి సమయాల్లో కొన్నిగంటలు మాత్రమే తనతో గడపటానికి తన గదికొచ్చే భర్తను ఇంకేమని అడుగుతుంది? అడగకూడదు— అందుకే వూరుకుంది.

తను పుట్టింటి నుండి రాగానే తన యిష్టసఖి పని నుండి తొలగించటం కారణమడిగితే తన భర్త అలా సమాధానమియ్యటం ఆమె ఆసక్తినెక్కువ చేసింది.

మర్నాటి వుదయం రంగి విషయం అడగవల్సిన వాళ్లనే అడుగుదామని రంగి బావయిన రాముడ్ని పిలిచింది.

కోర మీసాలతో కోడెద్దులాగా వుండే రాముడు శుష్కించిపోయి అతి నీరసంగా వున్నాడు. భారంగా అడుగులో అడుగేసుకుంటూ వచ్చి దీనవదనంతో నిలబడ్డాడు.

శ్రీదేవి, రంగి విషయమెత్తగానే రాముడు నిలువునా వణికిపోయాడు. పాలిపోయిన వాడి మొగం కోపంతో ఎర్రగా జేవురించింది లోతుకుపోయిన వాడి కళ్లు ఎర్రగా పైకుబికాయి.

పళ్లు పటపట లాడిస్తూ, "రంగి సంగతా?" అన్నాడు—అని వెంటనే తను చిన్నమ్మగారి యెదుట వున్న విషయం గుర్తుకు తెచ్చుకున్నాడు. తమాయించుకున్నాడు.

"దాని సంగతెందుకమ్మా? అది సెడిపోయింది— తప్పుడు ఉం—" పయిగుడ్డతో ముంచుకొస్తున్న దుఃఖాన్ని ఆపుకుంటానికి ప్రయత్నించాడు.

శ్రీదేవి తన చెవులను తానే నమ్మలేకపోయింది. కొన్ని క్షణాలు స్థాణువుగా అయిపోయింది.

రాముడు భోరు భోరున ఏడుస్తూ అక్కడే చతికిలబడ్డాడు. శ్రీదేవి భారంగా నిట్టూర్చి ప్రక్క గదిలోకి వెళ్లిపోయింది.

...రంగి చెడిపోవటమేమిటి? రంగిలాటి మంచిపిల్ల, అమాయకురాలూ ఎలా చెడిపోయింది? ఎందుకు చెడిపోయింది? ఇందుకేనన్నమాట దాన్ని పని మాన్పించింది. ఆయన, 'డర్టీక్రీచర్!' అంది! ఇది నమ్మదగ్గ విషయమేనా? రంగి ఇలాటి పన్జేస్తుందా? ఏమో, నిప్పులేనిదే పొగరాదుగా! పాపం, ఆ రాముడ్ని చూస్తే తన కడుపు తరుక్కుపోతుంది. ఎలాటి వాడు ఎలా అయిపోయాడు? దాన్ని వాడి ప్రాణంగా చూచుకునేవాడు. అదీ అంతే! మరి వాడికిది ఇంత ద్రోహం ఎలా చేసింది?

..శ్రీదేవి ఆలోచనలు ఇలా సాగుతున్నాయి. ఆమె కారోజంత మనసు మనసులో లేదు. తన గదిలో కాసేపు అటూ ఇటూ పచార్లు చేసి కిటికీ దగ్గరకెళ్లి నిలబడింది. కిటికీ గుండా క్రిందకు తొంగి చూచింది. క్రింద రాముడు కనిపించాడు. తోటలో గున్నమామిడి చెట్టు క్రింద కూర్చుని మొగాన గుడ్డేసుకుని కుళ్లి కుళ్లి ఏడుస్తున్నాడు. ఆ దృశ్యం చూడగానే శ్రీదేవి గుండెల్లో విషాదం బుసబుసా పొంగింది.

ఈ కిటికీ దగ్గర ఇలాగే నిలబడి క్రింద ఆ గున్నమామిడి చెట్టు దగ్గర సరసాలాడుకునే రాముడ్ని రంగిని ఎన్నోమార్లు చూచింది. ఒక్కొసారి రంగి వాడ్ని కవ్విస్తూ తోటంతా పరుగులు పెట్టేది. దాన్ని పట్టుకోవటానికి దాని వెనుక వీడూ పరుగెత్తేవాడు. వాళ్లిద్దరూ అలా పరుగులు తీయటం చూస్తూ వుంటె తనకెంతో ముచ్చటయ్యేది.

ఒకరి మనస్సు మరొకరికి అందించుకుని నిర్మలంగా స్వేచ్ఛగా, వులాసంగా కేరింతలు కొట్టే ఆ ప్రేమజంటను చూచినప్పుడు కొన్నిసార్లు తనకు తెలియకుండానే తనలో ఒకవిధమైన ఈర్ష్య చోటు చేసుకునేది. తన దాంపత్యం గుర్తుకొచ్చేది. రోజులో కొన్నిగంటలు మాత్రం భార్యాభర్తలు కలిసి వుండటం దగ్గరగా వున్న ఆ కాసేపు ఇద్దరి మధ్య ఎంతో దూరం, 'మీరు'—'మీరు' అని ఒకరినొకరు సంబో

# వలపు తెమ్మెరలు

చల్లని గాలులు వీచినవీ!
చల్లగ నామది దోచినవీ!!

రమ్మని పిలిచిన పిల్లనగ్రోవికి
కమ్మనిగానము నేర్పినవీ!
కదలే అలలై కమ్మని కలలై
రసలోకములో తేలినవీ!!

విరిసీ విరియని విరికన్నియతో
సరసములాడుచు సాగినవీ!
వయసున్నపుడే అనుభవింపుమని
వలపులు విరిలో రేపినవీ!!

పూలబాలికల కన్నె మనసులో
మురాగబాసలను అరసినవీ!
మల్లిసుందరి వలపు దోచుకొని
చల్లగ అవలికి జారినవీ!!

ఒంటరి పూవుల ఒయ్యారముగని
కొంటెగ ఈలలు వేసినవీ!
'తుమ్మెదకూరిమి నమ్మకుమా!' అని
నమ్మిక పుట్టగ పలికినవీ!!

కళలంటినవే చరితార్థత యని
విరులకు నాట్యము నేర్పినవీ!
కమ్మని వలపులు కానుకగా గొని
గాలులు ముందుకు సాగినవీ!!

చల్లని గాలులు వీచినవీ!
చల్లగ నామది దోచినవీ!!

—వక్కలంక లక్ష్మీపతిరావు

## కాలుజారింది

ధించుకోవటం. శుష్కమర్యాదలు, మనుష్యుల్ని మమతల్ని మనస్సులను దూరంచేసే అర్థంలేని ఆచారాలు! వీళ్ళలాగా నీరెండలు వెండివెన్నెలలో, చెట్ల నీడల్లో, పక్షుల లాగా ఒకరినొకరు తరుముకుంటూ, సరసాలాడుకుంటూ ప్రపంచాన్ని మర్చిపోవటం ఒకరిలో నొకరు కరిగిపోవటం— తనకు వూహించటానికి కూడ స్వేచ్ఛలేని విషయం. అందుకే కాబోలు గుండెల్లో ఈర్ష్య గుసగుసలాడేది. అదీ కాసేపే!.. తన చేతుల మీదుగా వాళ్ళ పెళ్ళి చెయ్యాలని తనెంతో వుబలాటపడేది. కాని వాళ్ళిలా అయ్యారు. అప్పుడప్పుడు తన మనస్సును, భావాలను మకిలపర్చే ఈర్ష్య వాళ్ళ బ్రతుకులను ఇలా చేయలేదు కదా!

* * *

ఆరోజు శుక్రవారం. వేణుగోపాలస్వామి గుడిలో భోగం చేస్తారు. మసి సంజలు ముసురుకునే వేళ శ్రీదేవి కోచ్‌బండిలో గుడికి బయలుదేరింది. బండిలో తన కెదురుగా కాంతం పూజసామాగ్రి పట్టుకుని కూర్చుంది. ముంగిలాగా గుంటనక్కలాగా కూర్చున్న కాంతాన్ని చూడగానే శ్రీదేవికి రంగి గుర్తుకు వచ్చింది. తను గుడికెప్పుడెళ్ళినా రంగి లేనిదే వెళ్ళేది కాదు. దారి పొడుగునా రంగి ఏవో కబుర్లు చెప్పుతూ అది నవ్వుతూ తనని నవ్విస్తూ వుండేది. ఇప్పుడు రంగి ఎక్కడ వుందో? ఏమి చేస్తుందో?

శ్రీదేవి ఇలా ఆలోచిస్తుండగా బండి పెద్ద కుదుపుతో ఆగిపోయింది. శ్రీదేవి తూలి ముందుకు పడబోయి సర్దుకుని కూర్చుంది.

“ఛీ, నీకు బుద్ధి వుందా లేదా? లే, దారి కడ్డులే” అని బండి వెనకాల నిల్చునే సింహాద్రి ఎవరి మీదనో పెద్దగా అరుస్తున్నాడు.

రోడ్డు మీద పిల్లల కేకలు అరుపులు—

“బాబాయి, బాబాయి. నీకు పుణ్యముంటుంది బాబాయి. ఒక్కసారి అమ్మగార్ని చూడనీయ్ బాబాయి. నీకాళ్ళట్టుకుంటా బాబాయి”

అది రంగి గొంతు! ఆ గొంతు వినగానే శ్రీదేవి చలించిపోయింది.

"ఛా, తప్పుడుదానా! ఫో, అవతలికి" సింహాద్రి రంగిని చేయి పట్టుకుని లాగి పారేస్తున్నాడు.

శ్రీదేవి బండికి కట్టిన తెరను కొద్దిగా తొలగించి బయటికి చూచింది. శ్రీదేవిని చూడగానే రంగి, సింహాద్రి చేతిని విడిపించుకుని రయ్యిన బాణంలాగా వచ్చి శ్రీదేవి పాదాలు పట్టుకుని, "అమ్మా, అమ్మా—" అని భోరు భోరున ఏడ్చింది.

"నాకేం తెలియదమ్మా! మీ పాదాల సాక్షిగా నాకేం తెలియదమ్మా" అని ఏడుస్తుంది.

విరబోసుకున్న జుట్టుతో ఆ చీకట్లో రంగి పిచ్చిదానిలాగా వుంది. లాగా వుండట మేమిటి? దానికి సగం పిచ్చి కూడ ఎక్కింది! అందుకే దాని వెనకాల పిల్లలు రాళ్లు రువ్వుతూ కేకలు పెడ్తూ తిరుగుతున్నారు. వూరు దాన్ని వెళ్లగొట్టింది. వూరి చివర్లో వున్న పాడుబడ్డ సత్రం రంగి మకాం!

"ఛా. అవతలికి పద—ఊ—పిన్నే" అంటూ చీదరించుకుంటూ కాంతం రంగిని నెట్టివేసింది. సింహాద్రి దాన్ని చేయి పట్టుకుని లాగాడు. బండి ముందుకు పరుగెత్తింది.

"పోలీసులు వుత్త పున్నేనికి పట్టుకున్నారమ్మా. నాకేం తెలియదమ్మా మీరన్నా చెప్పండమ్మా!"

వెనకాల రంగి ఏడుస్తూ కేకలు పెట్టుతుంది. దాని చుట్టూ మూగిన పిల్లలు గోలగా అరుస్తున్నారు.

శ్రీదేవి, "పోలీసులు అంటుందేమిటే?" అని కాంతాన్ని అడిగింది.

"దాని గొడవెందుకు పోనీయండమ్మా"

"కాదు చెప్పవే"

ఏదో చెప్పరాని విషయం చెప్తున్నట్లుగా మొగం పెట్టి కాంతం ఇలా చెప్పింది. "మిమ్మల్ని దేవళ్లో బండెక్కిస్తానికి అది మీతో పాటు పట్నం వచ్చిందిగా. మిమ్మల్ని బండెక్కించినాక ఆరాత్రి హోటల్లో ఎవడితోనో వుంటే పోలీసులు పట్టుకుని, కొట్లో పెట్టారు."

గుర్రం భయంకరంగా సకిలించింది. రంగి ఏడ్పు దూరంగా సన్నగా వినిపిస్తోంది. బండిచక్రాలు రోడ్డు మీద టకటకలాడుతున్నాయి.

శ్రీదేవి వెనక్కి జారి కూర్చుంది.

కాంతం చెప్తుతుంది—'ఈసంగతి తెల్సి రాముడు, దివానుగారు పట్నం వెళ్లి దాన్ని


## అధైర్య పడవద్దు

శాస్త్రీయమైన, నిజమైన SEX-ADVICE పొందవచ్చును. మీకు ఉన్న లక్షణములు వ్రాయుమూ, యికా వివరాలకు కవరు పంపేది.

డా. రత్నం&సన్స్, (Estd 1904)
మలకపేట బిల్డింగ్స్, New
(అజంపూరా మార్కెట్ వద్ద)
హైదరాబాద్—36 ఆం. ప్ర.

## ఇవి చదివేరా?

విద్యార్థులకు:- మీ పిల్లల బాగుకు పనికివచ్చే కొన్ని వందల ఉపయోగ విద్యా వివరాలు రూ.5.00
చేతిపనులు:- ధనసంపాదనకు పనికివచ్చే అనేక వందల మంచిసరుకులుచేసే సులభ మార్గాలు రూ.3.50
మంత్రశక్తి:- మీకోర్కెలు సిద్ధింపజేసే అనేకమంత్రాలు వాటి గొప్పరహస్యాలు, సాధన మార్గాలు. రూ. 3.50
జీవిత రహస్యాలు:- మీదాంపత్యసుఖానికివెంటనే తెలుసుకోదగ్గ అనేక కామ సూత్రాలు రూ. 3.50
యువతి:- స్త్రీలనుగురించి తెలుసుకోదగ్గ అనేక మంచి కుతూహల విషయాలు. రూ. 3.50
సంతానము:- అవసరం లేనపుడు గర్భం రాకుండా 60 నవీన సులభ మార్గాలు రూ 3.50
పోష్టుఖర్చులుచితం దేశసేవ ప్రచురణలు, ఏలూరు
ఆంధ్రకు వ్రాస్తే వి. పి. పోష్టుద్వారా పంపబడును

## తప్పక చదవండి!

యద్దనపూడి సులోచనారాణి గారి రచనలు

| | | |
|---|---|---|
| విజేత—జ్యోతి సీరియల్ | రు. | 6-00 |
| సెక్రటరీ— ... ... | | 6-00 |
| బహుమతి—కథలు | | 5-00 |
| జ్యోతి — ... | | 5-00 |
| నేను రచయిత్రిని కాను... | | 5-00 |

కొమ్మూరి వేణుగోపాలరావు గారి సరికొత్త నవల

| | |
|---|---|
| నివేదిత | 6-00 |

కొండముడి శ్రీరామచంద్రమూర్తి గారి ఆంధ్రపత్రిక సీరియల్

| | |
|---|---|
| కరుణ | 6-00 |

* పూర్తి సెట్ కావలసిన 35 రూ
విడిగా కావలసిన వాటి ధర M. O ద్వారా పంపిన పోస్టు ఖర్చులు ఉచితం.

నవభారత్ బుక్ హౌస్,
ఏలూరు రోడ్—విజయవాడ-2

నిరాశ చెందవద్దు
దాంపత్య జీవితంలోని బలహీనతగూర్చి మీరు చింత పడవద్దు

## జీవన స్పెషల్



రుచియైన ఆయుర్వేదటానిక్. ఉత్తమగుణములుగలది. కోల్పోయినశక్తి పునః కూర్చి దాంపత్య జీవితాన్ని ఆనందమయం చేస్తుంది. స్త్రీలు ప్రసవానంతరం "జీవన స్పెషల్" సేవించిన, యౌవనులుగా నుందురు.

ఎక్కువ ఫలితానికి:-
... మంచిది - కావలసినంత దేహ వ్యాయామము చేయవలెను - ...

ముఖ్య గమనిక : జీవన స్పెషల్ మీ దేహాన్ని తొందరగా పోషించు శక్తిగలది, కాబట్టి మూడు వారములు సేవించిన తర్వాత ఒక వారంరోజులు మానివేయుట చాల అవసరం. లేనియెడల లావైపోదురు. లేక దాంపత్యవాంఛ అధికమగును. ఆరోగ్యం బలం చేకూరినవెంటనే మానివేయవలెను. 450 గ్రాముల ప్యాకింగ్‌లో లభించును. ధర రు 10/-

## అమృత లేపనం (పురుషులకు మాత్రము)

దాంపత్య జీవితములో శీఘ్రమైన లేక జీర్ణించిన అన్ని రకాల బలహీనతలకు శక్తివంతమైన ఔషధము. (పై పూతకు మాత్రము) 25 M.L.L. సీసా 1 కి ధర రు. 10/- నికరం.
ఉచిత కరపత్రములకు వ్రాయండి ఉత్తరములు ఇంగ్లీషులో వ్రాయవలెను. అన్ని ఆర్డర్లతోపాటు ఔషధము ధరలో సగం పంపవలెను. మిగతామొత్తమునకు వి. పి. పి. పంపబడును ప్యాకింగు మరియు ఫార్వార్డింగ్ ఛార్జీలు అదనం. *Orders to:*

**Jeevamritham Oushadha Sala,**
CALICUT-1.(S.India)
Chief Physician: Dr. K. N. RAMDAS Phone: 2419 & 3607

గమనిక : ఆంధ్ర, మధ్యప్రదేశ్ మరియు ఒరిస్సాలలోని అన్ని ముఖ్య పట్టణములకు స్టాకిస్టులు కావలెను. షరతులకు, నిబంధనలకు వ్రాయండి.

ము గ తా ము



కుమారి జి. ఏ. భారతి, బి.యస్‌సి. (మొదటి సంవత్సరము) కె.వి.ఆర్. ప్రభుత్వ స్త్రీల కళాశాల, కర్నూలు, శ్రీ జి.సి. రమణ్ణ, అడ్వొకేటు, అనంతపురం గారి కుమార్తె 4-12-66 తేదీ రాత్రి 10 గంటలకు స్వర్గస్తురాలైనది. ఆమె ఆత్మకు శాంతి కలుగుగాక. —కె. బాలకృష్ణమూర్తి.


**కుట్టుపని నేర్వండి**



గురువు లేకుండా అన్నిరకముల[illegible] స్వయంగా కత్తిరించి కుట్టుటకు 384 పేజీల 400 బొమ్మల పుస్తకం రు.8/- బట్ట [illegible] పోకుండా కత్తిరించుటకు 352 పేజీల 2 వేల బొమ్మల 160 ప్లాన్ల పుస్తకం రు.10/- [illegible] తెలుగు, వి.పి.[illegible], జి.పున్నారావు చౌదరి, [illegible] పోస్టు, (వయా) బంటుమిల్లి, బందరు తాలూకా.


## రచయితలకు విజ్ఞప్తి

తమ రచనలతో కాక విడిగా స్టాంపులు పంపే వారి రచనలు తిప్పి పంపడం సాధ్యం కాదు. ఈ విషయంలో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపే అవకాశం కూడా లేదని గుర్తించ ప్రార్థనం.

# కాలం జారింది

విడిపించారు. తనే పాపమెరగని పిడుసున్నది. మరి ఆ హోటల్‌లో ఎందుకున్నావే అని ఎవరెన్ని అడిగినా చెప్పదు. తన కేం తెలియదంటుందేగాని అక్కడెందుకున్నదీ చెప్పదు. ఆ తప్పుడు పన్జేసిన తప్పుడుముండ నిజం చెప్పుతుందా అమ్మగారు!"

గుడి ముందు కోచ్ ఆగింది. గుడి లోపల సన్నాయి ఉచ్ఛస్వరంతో పలుకుతుంది. సింహాద్రి ఘోషకు కావల్సిన సరంజామా తీసికొచ్చాడు.

"నేను బండిలోనే వుంటానే, నీ వెళ్లి ఆ దండా అదీ యిచ్చి ప్రసాదం తీసికురా" గుడికని వచ్చి లోపలికి రాకుండా బండిలోనే వుంటాననుటున్న అమ్మగార్ని కొంతం వింతగా చూచింది. మారు మాటాడకుండా లోపలి కెళ్లింది.

చుట్టూ నీలితెరలు దింపిన కోచ్‌లో చీకట్లో శ్రీదేవి ఒంటరిగా కూర్చుంది. బండి లోపలి చీకటిని ఇంకా చీకటి చేయటానికి కళ్లు గట్టిగా మూసుకుంది"

"మీరన్నా చెప్పండమ్మా నాకేంతెలియదమ్మా! పోలీసులు వుత్త పున్యేనికి పట్టుకున్నారు" రంగి దీనాలాపాలు పదేపదే శ్రీదేవి చెవులో మారుమ్రోగుతున్నాయి.

గుర్రం పూరికే సకిలిస్తోంది. గుడిలో గంటలు గణగణ మ్రోగుతున్నాయి. శ్రీదేవి మానసికాంబరాన మెరసిన ఒకమెరుపు పొగి ఆకాశాన్ని తాకిందా అన్నట్లుగా చీకటి ఆకాశం తళుక్కుమంది

* * *

"నేనిక్కడ వుంటానని వూహించి వుండవు కదూ శ్రీ!"

"............"

"మాటాడవేం శ్రీ! నిన్నిక్కడికి రప్పించానని కోపమా?" చక్రకేళి తొక్కను, విలాసంగా పారేస్తూ అన్నాడా వ్యక్తి!

"..................."

"ఎంత ఖరీదయిన సరుకయినా గొంతు దిగేటప్పుడు ఒకే మంటగా వుంటుంది. అందుకే ఈ సంజాడు."

"ఎందుకు మోహన్, ఇలా తాగుతావు?"

"నిన్ను మర్చిపోవటానికి శ్రీ! నన్ను నీవు తేలిగ్గా మర్చిపోయావు. కాని నిన్ను నేను మర్చిపోలేకపోతున్నాను. నాదగ్గరున్న నీ వుత్తరాలు నన్ను మర్చిపోనీయటంలేదు డియర్ శ్రీ—"

"అంటే" శ్రీదేవి కోపంగా చూచింది.

"అంటే ఏముంది? శ్రీ కావాలి శ్రీ" నవ్వుతూ అన్నాడు మోహన్.

"అయిదు వేలుతీసికుని నెల కూడా కాలేదు."

"డివేల్యూయేషన్ శ్రీ! నీకు తెలియనేముంది?" విలాసంగా కాళ్లు ఎత్తి టీపాయ్ మీద పెట్టుతూ అన్నాడు.

"నన్నెందుకిలా పీడిస్తావ్ మోహనయ్యా! ఇంత కంటె నీ చేతుల్తో నా గొంతు పిసికి పారేయకూడదు."

"నో, నో, శ్రీ! నీవు వెయ్యేళ్లు నిండుగా బ్రతకాలి. రోజుకు కొన్ని కొన్ని చస్తున్న నేనింకెన్నాళ్లు బ్రతుకుతాను. చాల కొద్ది రోజులు. ఆ కొద్దిరోజులు జీవితాన్ని అనుభవించనీయ్. జీవితాన్ని అనుభవించాలంటె మనీ వుండాలి. అది నీకు వుంది. నాకు లేదు. అందుకే మీ అమ్మ సొంత తమ్ముడినయినా సరే నిన్ను నా కివ్వను పొమ్మంది. ఇరవై లక్షల కట్నం యిచ్చి నీ పెళ్లి చేసింది. ఆ ఇరవై లక్షలు నాకూ యిస్తే నేనూ జమిందార్నైనా?......"

"పెళ్లికి ముందు తెలియని వయస్సులో నీ ఆకర్షణలో పడి రాసిన కొన్ని వుత్తరాలు పట్టుకుని నా జీవితంతో చెలగాటలాడుతున్నావు కద మామయ్యా!"

ఆరోజు శ్రీదేవి ప్రయాణ సన్నాహంలో వుండగా ఫోన్ మ్రోగింది. మోహన్, చేశాడు. "అక్కడికి నన్ను రమ్మంటావా? ఇక్కడికి నీవు వస్తావా?" అని అడిగాడు. ఎలాగు తనక్కడికి రావటానికి వప్పుకోదని తెల్సు. ఎలాగు ఆరోజు వూరెళ్లబోతుంది గనుక అతడు చెప్పిన అడ్రసు ప్రకారమతన్ని కలసి ఈ వ్యవహారం పైసలు చేయాలను కుంది. అందుకే అక్కడికి వచ్చింది.

మోహన్ నవ్వి, "నా ప్రేమతో, నిన్ను పెళ్లి చేసుకో లేకపోయాను. కనీసం 'మనీ' చేసుకోనీయవా?", అని అన్నాడు.

మోహన్ వంక అసహ్యంగా ఒక పురుగును చూచినట్లు చూచింది శ్రీదేవి.

"సరే" ఏదో అనబోయే లోపల బయట ఏదో గొడవ, కేకలు వినిపించాయి. అప్పుడు దాక గది బయట వరండాలో నిల్చొని వున్న రంగి, "అమ్మా—పోలీసులు, పోలీ

"బాబూ—వదలండి అటే వదలండి—" అని కంగారుగా అరుస్తూ లోపలికి వచ్చింది.

పోలీసులు ఎందుకు వస్తున్నారో ఏమిటో తనకేమీ అర్థం కాలేదు. రంగి కేకలకు కంగారు పడింది. పైగా అది తనని బయటికి తోసేసినంత పని చేసింది. ఆ కంగారులో, భయంతో తనేం చేస్తుందో తనకే తెలియలేదు. ప్రక్క గుమ్మంలోంచి బయటికి వచ్చింది. అటు చీకట్లో ఏవో చెక్కమెట్లు కనిపించాయి. వాటి గుండా క్రిందకి దిగింది. ఒక చీకటి సందు కన్పించింది. ఆ సందులో వందగజాలు నడిచేసరికి మెయిన్ రోడ్డూ టాక్సీలు కనిపించాయి. ఒక టాక్సీని పిలిచి అందులో ఎక్కింది. అందులో కూర్చుని రంగి కోసం చాలసేపు చూచింది. అది రాలేదు. చేతి గడియారం చూచింది. తనెళ్ళవల్సిన ట్రెయిన్‌కు ఇంకా పదినిమిషాల టైం వుంది. అది తప్పితే మరల రిజర్వేషన్ దొరకదు. అవతల జబ్బుగా వున్న తల్లిని చూడాలి. రంగి ఎంత చూచినా రావటంలేదు. అది యింటికి తిరిగిపోతుందిలే అని టాక్సీని స్టేషన్‌కు పోనీయమంది.

తన వెనకాలే కంగారుగా రాబోయ్యి రంగి గుమ్మంలో చక్రకేళి తొక్క మీద కాలువేసి జారి క్రిందపడటం అది లేచే లోపల పోలీసులు లోపలికి వచ్చి దాన్ని లేపటం శ్రీదేవికి తెలియదు.

రంగిని పోలీసు లెందుకు పట్టుకున్నారో ఇప్పుడు తెల్సింది. మోహన్‌ను కలవటానికి తానెళ్ళింది ఒక మోసరకం హోటల్ అని ఇప్పుడు తెల్సింది. ఎంత మంది ఎన్నివిధాల అడిగినా రంగి ఎందుకని అది ఆ హోటల్ కెళ్ళిందో ఎందుకు చెప్పలేదో ఇప్పుడు అర్థమయింది. రంగి ఎలా చెడిపోయిందో, ఎవరి కోసం చెడిపోయిందో ఇప్పుడు శ్రీదేవికి తెల్సింది!!

"ప్రసాదం తీసికోండమ్మా!" అని కాంతం పిలిచిన పిలుపుకు శ్రీదేవి ఉలిక్కిపడి ఈ లోకంలోకి వచ్చింది. బయట భయంకరమైన వర్షం, చీకటి.

మర్నాడు శ్రీదేవి నిద్ర లేచిన వెంటనే విన్న వార్త: ఆరాత్రి పాడుబడ్డ సత్రంలోనే పాడుబడ్డ నూతిలో పడి రంగి చనిపోయింది.

●


# ఆంధ్రసచిత్రవారపత్రిక

# నవలల పోటీ!

## మొదటి బహుమతి రు.3,500
## రెండవ బహుమతి రు.1,500
## మూడవ బహుమతి రు.1,000

ఆంధ్రసచిత్ర వారపత్రిక పాఠకులకి మరింత మంచి సీరియల్ నవలలని అందచెయ్యాలనే ఉద్దేశంతో పై పోటీని నిర్వహిస్తున్నాము. రచయిత(త్రు)లందరూ ఎప్పటివలె మాతో సహకరించి పై పోటీ జయప్రదం చెయ్యగలరని ఆశిస్తున్నాము.

## ముగింపు తేది: 31-1-1967

**రచయితల కోరికపై గడువుతేదీ పొడిగిస్తున్నాము**

## నిబంధనలు

1. పోటీకి స్వంతరచనలే పంపాలి. పంపే రచనలు తమ స్వంతమయినవే ననీ, అనువాదాలుకాని, అనుసరణలుకాని కాదని రచయిత(త్రు)లు వ్రాతప్రతితో బాటు హామీ పత్రాలు పంపాలి.

2. రచనలు కాగితానికి ఒకవైపునే, సిరాతో రాసిఉండాలి. 100అరఠావు (ఎక్సర్సయిజు పుస్తకం పేజికి రెండురెట్లు) పేజీలు లోపు,300 అరఠావు పేజీలు మించి ఉండరాదు.

3. నవలలు తెలుగువారి జీవితానికి సంబంధించి ఉండాలి.

4. వ్రాతప్రతులు 31—1—1967 లోపల మా కార్యాలయం చేరాలి.

5. వ్రాతప్రతులు, 'సంపాదకుడు ఆంధ్రసచిత్ర వారపత్రిక, తంబుచెట్టివీధి, మద్రాసు—1' కి పంపాలి.

6. కవరుమీద, వ్రాతప్రతిమీద 'నవలల పోటీ— 1966' అని స్పష్టంగా రాయాలి.

7. పోటీలో నెగ్గని నవలలు ఆంధ్రసచిత్ర వారపత్రికలో ప్రచురించే హక్కు మాకు ఉంది.

8. పోటీలో నెగ్గని, ప్రచురణకి స్వీకరింపబడని నవల వ్రాతప్రతులని వీలయినంత త్వరలో, సురక్షితంగా రచయిత(త్రు)లకి తిప్పిపంపే ప్రయత్నాలు చేస్తాము కాని ఈ విషయంలో ఎటువంటి బాధ్యతని వహించలేము, హామీ ఇవ్వలేము. వ్రాతప్రతులతోబాటు తగుమాత్రం తపాలాబిళ్ళలు అతికించిన, స్వంత చిరునామా కల కవర్లు జతపరచటం అవసరం.

9. పోటీలో తుదినిర్ణయం సంపాదకునిదే. ఈవిషయములో ఎటువంటి ఉత్తరప్రత్యుత్తరాలూ జరుపబడవు.

10. ఆంధ్రసచిత్ర వారపత్రికలో ప్రచురణ పూర్తి అయిన తర్వాత పుస్తక రూపంలో నవలని వెలువరించగోరేవారు పుస్తకంలో ప్రముఖంగా 'ఆంధ్రసచిత్ర వారపత్రికనుంచి పునర్ముద్రితం' అని పేర్కొనాలి.